# పెన్షన్

తాలూకా ఆఫీసులోంచి కొడుతూన్న గంటలు....ఒకటి .... రెండూ.... పదకొండు! లెక్క పెట్టాడు నరసింహం. అటునుంచి ఇటు వత్తిగిల్లాడు. దాదాపు రెండు మూడు గంటలనుంచి మంచంమీద అటూ యిటూ దొర్లుతూనే ఉన్నాడు. నిద్దర పట్టడంలేదు... ఆలోచనలు! ఒకటే ఆలోచనలు! "ఏవిటి చెయ్యడం? ఇప్పుడెలాగ? అధమం రెండు వందలేనా లేకుండా పని జరుగుతుందా? హైదరాబాదు వెళ్ళి రావాలంటేనే అవుతాయి ఏభై అరవై రూపాయలు. ఆపైన, వాడికి చెల్లించే ముడుపు.... ఖర్చులు, అవీ ఇవీ మొత్తం రెండు వందలికి తక్కువకావు. ఉద్యోగంలోంచి రిటైరయి చేతిలో నయాపైసా లేకుండా కూర్చున్న తనకి, రెండు వందలు అప్పు పుట్టొద్దూ? ఇంక అడిగేది మాత్రం ఎవరిని? తెలిసినంత మట్టుకి చేబదుళ్ళూ అప్పూ అందరి దగ్గరా పట్టు కొచ్చాడు. ఇంక తెలిసిన మనిషే మిగలలేదు కొత్తగా అప్పు చెయ్యడానికి.

అయినా ఇద్దరి ముగ్గుర్ని అడిగి చూశాడు. "నోటు రాసిస్తాను. ఒక్క రెండు వందలిప్పించండి.... హైదరాబాదు వెళ్ళివస్తే, నా పెన్షన్ కాగితాలు కదులుతాయి. పెన్షన్ వచ్చిన

మర్నాడు మీబాకి తీర్చేస్తాను" అంటూ. తనమాటలువిని వాళ్ళు ఒకటే నవ్వడం! "ఇదిగో నరసింహం! నీకైతే ఇంకా నమ్మకం ఉందేమోకాని మాకు మాత్రం లేదయ్యా నీకింక పెన్షన్ వస్తుందని." ఆ మాటలువిని తను వణికిపోయాడు. నిజంగానా? "వాళ్ళుఅన్నమాట కూడా నిజమే నేమోనే!" అన్నాడు సీతతో. కాని ఆమె ధైర్యం చెబుతూ "ఏపనికేనా ముందే అలా నిరాశపడితే ఎలా చెప్పండి! మన ప్రియత్నం మనం చెయ్యాలి, అని మీరేకదా అనేవారు" అని తనలో తలెత్తిన నిరాశని ఒకటి రెండుమార్లు పోగొట్టింది. పక్క మంచంమీద నిద్రపోతున్న భార్య ముఖంలోకి చూశాడు. పేద ముత్తైదువ వేషంలో ఉన్న శ్రీ మహాలక్ష్మిలా కళకళ్లాడి పోతోంది. నిట్టూర్చాడు నరసింహం.

కష్టాల్ని సుఖాల్ని తనతో సమానంగా పంచుకుంటూ, నిత్యం తనకి ధైర్యాన్ని, బలాన్ని ఇస్తూ, తనతోడిదే లోకంగా బ్రతుకుతోంది. సీత అండలేకపోతే, తను ఇన్నాళ్ళు యిలా నిబ్బరంగా బ్రతికి ఉండేవాడా? రిటైరయి యేడాది కావస్తోంది.

రిటైరయ్యాక ఎలా తోస్తుందని అప్పుడు బెంగెట్టుకున్నాడు, కాని ఇప్పుడా బెంగలేదు. పెన్షన్ కాగితాలకోసం తనుపని చేసిన తాలూకా ఆఫీసు చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగేటప్పటికే రోజు సరిపోతోంది. రోజు రోజుకి రోజు గడవడం కష్టం అయిపోతోంది. ఓ రూపాయి అప్పు ఎక్కడేనా పుడు

తుందేమో అని దేవురించడం, పెన్షన్ కాగితాలు కదిలాయే మోనని తాలూకా ఆఫీసు చుట్టూ ఓమారు ప్రదక్షిణం చేసి రావడం. ఇలా అయిపోయింది తన దినచర్య.

నిన్నో - మొన్నో "అన్నం పెట్టు ఆఫీసుకెళ్ళాలి" అని సీతని తొందర పెట్టాడు తను.

"బాగానే ఉంది. రిటైరయినా విశ్రాంతి లేకుండా ఆఫీసు చుట్టూ తిరగడం ! ఎలా నీరసించి పోయారో చూడండి ఈ వయస్సులో పండో ఫలమో తింటూ మనవల్ని ఆడిస్తూ, చీకూ చింతా లేకుండా గుమ్మంలో కూచోవలసింది పోయి" అంటూ గుడ్ల నీరు కుక్కు కుంది.

"వెర్రిదానా! చీకూ చింతా లేకుండా ఎలా ఉంటుందే! మనకేమైనా మొగపిల్లలు ఉన్నారు కనకనా? ఉన్న ఆ ఒక్క నలుసూ ఎదిగి పెళ్ళికి సిద్ధంగా ఉంది. దాన్ని ఓ అయ్యా చేతిలో పెట్టొద్దూ! మనకి రోజు గడిచే ఎత్తు చూసుకోవద్దూ? ఏవో ఆ పెన్షన్‌రాళ్ళు కాసిన్నీ వస్తే-" తనలో తనే గొణుక్కుంటూ తాలూకా ఆఫీసుకి వెళ్ళాడు.

"మమ్మల్నేం చెయ్యమంటారుసార్? కాగితాలు హైదరాబాదు పంపాము. అక్కడనుంచి రావాలికదా?" అన్నాడు తన ప్లేస్‌లో కొత్తగా వచ్చిన ఆ గడుగ్గాయి కుర్రాడు. ఎప్పటి నుంచో పాడుతూన్న పాటే అది! సిగరెట్లు ఊదిన వాడు ఊదినట్లుంటాడు కాని సరిగా మాట చెప్పడు. ఎప్పటినుంచో

ఉంటూన్న 'రికార్డు కీపరు' మాత్రం చెప్పాడు ఓ మాట "అయ్యా నరసింహంగారూ! మన కాలంకాదు. ఇప్పుడు కుర్రాళ్ళు బోలెడు డబ్బుబోసి ఉద్యోగాలు కొనుక్కుంటు న్నారు. మరి వాళ్ళు పెట్టిన పెట్టుబడి రావద్దా? అందుకే ఆ అబ్బాయి ఒక వ్రతం పెట్టుకున్నాడు. చెయ్యి తడికాందే నోరు మెదపకూడదు. కాగితం కదపకూడదు అని. సాటి గుమాస్తాని కదా, నా దగ్గర కూడానా అని మీరు తెల్ల బోకండి, పాపం ఆచెయ్యికి అలా అలవాటయి పోయింది ఏంచేస్తాడు?" అని.

తనకి నోటమాట రాలేదు. లంచం ఇవ్వడమే కనక అలవాటుంటే తానీ పాటికి పెద్ద ఆఫీసరుగా రిటైర్ అయి ఉండును. తీసుకోవడం అలవాటుంటే ఈ పెన్షన్ డబ్బుల కోసం ఎదురు తెన్నులు చూస్తూ కూర్చోనక్కర లేకనూ పోను. రెండూ చేతకాకే యిలావుండి పోయాడు తను.

వెంటనే నరసింహం మనస్సు ఎదురు తిరిగింది.

నాన్సెన్స్! చేతకాక ఏవిటి? ఊహు! చేతకాక కాదు, ఇష్టంలేక....అవును ఇష్టంలేకే.

లేకపోతే, తను ఉద్యోగంలో చేరిన కొత్తలో "ఈ సహాయం చేశారు-థాంక్స్-ఏవిమ్మంటారు?" అంటూ పర్సులు తీసేవారు, వచ్చినవాళ్ళు-తనకి ఇష్టం ఉంటే తీసుకోక పోయాడా? ఏదూరవు చుట్టం పేరో బేంక్‌లో ఎకౌంటు

ప్రారంభించక పోయాడా? మొదటినుంచీ తనకా పద్ధతి కిట్టదు. అందుకే వచ్చినవాళ్ళతో "నా అలవాట్లు మీకు తెలియవు కాబోలు భలేవారే! పర్స్ జేబులో పెట్టుకోండి. చిరునవ్వు మాత్రం ఒకటి ఇలా పారేయండి" అనేవాడు.

వాళ్ళు "మీరు డైరెక్టుగా గాంధీ శిష్యులండీ! అంటూ ఒకటే నవ్వడం! కొత్తలో కొన్నాళ్ళిలా డబ్బు కక్కుర్తికి లొంగకుండా రోజుకో గండాన్ని ఎదుర్కొనేవాడు. తర్వాత ఆ గండాల భయం పోయింది. అందరికీ తెలిసిపోయింది. "నరసింహం లంచాలు తీసుకోడు" అని-పర్సులు ఖాళీ కాకుండా పనులందరికీ అయిపోయాయి. మంచి పేరు మాత్రం తనకి మిగిలిపోయింది అన్నింటికీ ఆ దేవుడు వున్నాడు పోనిద్దూ అనే నిశ్చింత-ఈ నాటికికూడా. అయితే ఆ కని పించని దేవుడు, పెన్షన్ వచ్చే ఆశకూడా కనిపించకుండా చేస్తున్నాడు. అక్కడికీ సీత ఎందరు దేవుళ్ళకో ముడు పులు కట్టింది. తనకుతోడు అదొక అమాయకురాలు. దేవుడికి ముడుపులు కడితే వస్తుందా, ఆఫీసులో ముడుపులు చెల్లిస్తే వస్తుంది కాని పెన్షన్!

తాలూకా ఆఫీసులోంచి పన్నెండు గంటలు విన్పిం చాయి.

ఉలిక్కిపడి, నిట్టూర్చి, అటుగా వత్తిగిల్లి, ఆప్యాయంగా చూశాడు నరసింహం. పక్క మంచంమీద సీత! కొంచెం వారగా, కుక్కి మంచంమీద తన ఆరో ప్రాణం లలిత! ఇద్దరూ చిరిగిన బట్టలే కట్టుకున్నారు. మూలనున్న గుడ్డి లాంతరు వెలుగులో, లలిత తొడుక్కున్న జాకెట్టు భుజాలమీద అతుకులు మరీ నరసింహాన్ని వెక్కిరించాయి.

హుఁ! పువ్వుల తోటలా ఎదిగి, అటు పెళ్ళీ, ఇటు చదువూ, ఏం లేకుండా నిరాలంకారంగా నిలిచిపోయిన లలిత, తన అశక్తతకి చిహ్నం. పాపం ఏం చేస్తుంది? ఏం తోచక, ఏం చెప్పలేక మాటి మాటికీ వీధి గేటుదగ్గరికి వెళ్ళి, వచ్చే పోయేవారిని చూస్తూ, కాలం గడుపుతోంది. లలిత బేల చూపులు చూస్తే, అప్పుడప్పుడు తన గుండెల్ని ఎవరో గుప్పెట్లో పెట్టుకుని గట్టిగా పిండుతూన్నట్లనిపిస్తుంది.

లలిత చూపులకి అర్థం తనకి తెలుసు. కాని ఈ పరిస్థితిలో తల తాకట్టు పెట్టినా వంద రూపాయలు పుట్టవు. పెళ్ళి అంటే అధమం రెండువేలయినా కావద్దూ? పోనీ అమ్ముదాం అంటే ఇంట్లో ఏమున్నాయి కనుక? గోడగడియారం దగ్గర్నుంచి ఫేముకుర్చీలదాకా, చిన్నం చిదరా అన్నీ ఇప్పటికే అయిపోయాయి.

అదంతాసరే - ఆలోచనలు అలా పోతూనే ఉంటాయి. ప్రస్తుతం హైదరాబాదు ప్రయాణానికి రెండు వందలు వచ్చే

మార్గం ఏవిటి? ఎంత తలబద్దలు కొట్టుకున్నా దారీ తెన్నూ తోచలేదు నరసింహానికి. గొంతు ఎండిపోతే, లేచివెళ్ళి, రాసిన్ని మంచినీళ్ళు తాగివచ్చి, తిరిగి మంచంమీద కూర్చున్నాడు.

పక్కమంచమీద పడుకున్న భార్య ముఖంలోకి చూశాడు. ముసలితనం వచ్చినా ముఖంలో కళకాంతులేం తగ్గలేదు. నుదుటనున్న ఎర్రని కుంకుమబొట్టు, ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఆమె ముఖానికి మరింత అలంకారాన్ని స్తోంది. ఇది వాళ్ళకి ఉందని కాని, తనకి లేదనికాని, ఎప్పుడూ బాధపడి ఎరుగదు. ఉన్నంతలోనే సంతృప్తిపడి తాలూకా ఆఫీసు గుమాస్తానే మహారాజుగా చూసుకొని పొంగి పోయిన ఉత్తమ ఇల్లాలు! ఎప్పుడేనా తను నవ్వుతూ "ఏవిటి నన్ను నువ్వు మరీ గొప్ప చేసేస్తున్నావు! ఎప్పుడేనా చిన్నం ఎత్తు బంగారంకాని పట్టుమని ఓ పట్టుచీరకాని కొనిపెట్టానా?" అంటే వెంటనే చిరునవ్వుతో "అదేంటండీ! బంగారంలాంటి మనస్సుమీది. పట్టు చీరలూ, బంగారాలూ లేక నాకిప్పుడు ఏం లోటు వచ్చింది?" అంటూ నొచ్చుకుంటుంది.

ఇప్పటికీ ఎప్పటికీ ఆమె ప్రోత్సాహమే తనకి బలం- ఆమె చిరునవ్వే తరగని ధనం - వీటిముందు మహా సామ్రా జ్యాలుకూడా లెఖ్ఖలేవు తనకి ... అలాంటి తన దేవతకి తానీ నాడు కడుపునిండా అన్నంకూడా పెట్టలేక పోతున్నాడు. పట్టరాని బాధతో ఈ చివరి ముక్కలు పైకి అనేశాడు

నరసింహం. "ఏవిటండీ అంటున్నారు? ఇంకా నిద్ర పోలేదూ?" అంటూ సీతమ్మ అటునుంచి ఇటు తిరిగి పడుకొంది.

ఆ కదలికలో మెడలోవున్న మంగళ సూత్రాలు చప్పుడయాయి.

ఆ శబ్దం చిత్రంగా వినిపించింది నరసింహం చెవులికి- కళ్ళు పెద్దవిచేసి మరీ చూశాడు.

మెదడులో ఏ మూలో నిద్రపోతున్న ఆలోచనా శకలం, లేచి వళ్ళు విరుచుకుని, బద్ధకంగా ఆవులించింది.

ఛ!....ఏవిటీ పాడు ఆలోచన....? ఎప్పుడూ రాంది ఇలా వచ్చిందేవిటి?.... ఛీ....ఛీ....ఎన్నిమాట్లో ఇలా వచ్చిన ఆలోచనని అసహ్యించుకున్నాడు. కసిరి దూరంగా ఎంత విసిరేస్తే, ఆ ఆలోచన అంత దగ్గరగా మళ్ళీ వస్తోంది. ఏక మెదడుని తొలిచేస్తోంది. అవును. తప్పేం ఉంది? ఆపదల్లో ప్రాణాల్నే అడ్డేస్తాం. ఆపదలన్నీ గడిచి అన్నీ సక్రమంగా సర్దుబాటు అయ్యాక మళ్ళీ చేయించుకోవచ్చు- పవిత్రమైనవి- నిజమే- ఈ ఆలోచన తెలివి తక్కువ ఆలోచనే- కాని....కాని....

భళ్ళున తెల్లారి పోయింది. కాని, నరసింహం ఆలోచనే, ఇంకా తెమల లేదు. కళ్ళు మూసుకుని ఆ మట్టునే పడుకుని ఉన్నాడు. కూతురూ, భార్యా లేచి పనులు చేసుకుంటున్నట్లున్నారు. ఇంట్లో ఏవస్తువు అయిపోయిందని

చెప్తారో, అనే భయం నరసింహాన్ని మంచంమీద కదల కుండా కళ్ళు మూసుకుని పడి ఉండేలా చేసింది. తన వాళ్ళదగ్గరే తను దొంగ! నరసింహానికి ఏడుపు ఆగలేదు.

బియ్యం కొలిచే సోలతో డబ్బా చప్పుడు చేస్తోంది సీతమ్మ.

బియ్యం అయిపోయాయని చెప్పడం కాబోలు!

అంత ఏడుపులోనూ, గుండె బ్రద్దలయ్యేలాగ బావురు మంటూ, పిచ్చిగా నవ్వుకున్నాడు. నరసింహం.

ఇవాళేవిటి? బియ్యం ఎప్పుడో అయిపోయాయి. వాళ్ళింట్లో సోలెడు, వీళ్ళింట్లో గిద్దెడు నోటి మంచినతం మీద అప్పుతెచ్చి, నాలుగైదు రోజులనుంచి తనకీ లలితకీ వండి పెడుతోంది. తాను మాత్రం పస్తులుంటోంది. ఆ సంగతి తనకి అర్థం అవుతోంది. కాని ఎలా పలకరించి అడగడం? "సీతా నువ్వు అన్నం తిన్నావా?" అని తను ఆప్యాయంగా పలక రిస్తే, ఆ ఆప్యాయతకి ఆమె గుండె ధైర్యం కోల్పోయి బావురుమని ఏడ్చేస్తే... ? తను ఓదార్చగలడా? ....

లలిత మంచినీళ్ళ బావికి వెళ్ళడంచూసి, "సీతా!" అంటూ మెల్లగా దగ్గిరికి వచ్చాడు నరసింహం.

"ఏవిటి?" అన్నట్లు చూసింది సీతమ్మ. ఆమె ముఖం చూసేటప్పటికి చెప్పదలచుకున్న మాట చెప్పలేక, "అహ.... అది కాదు...." అంటూ మాటలు మింగేసి, నీళ్ళు నమిలాడు.

"అదేవిటి, నాతో చెప్పడానికి సందేహిస్తారు?"

"మరేం లేదు.... నీతో చెబుదాం అనీ...."

"చెప్పండీ!.... ఏవిటి? మళ్ళీ బ్లడ్‌ప్రెషర్ వచ్చిందా? ....ఎలా ఉంది వంట్లో?" అంటూ ఆప్యాయంగా దగ్గరకు వచ్చింది సీతమ్మ.

నరసింహం గుండె కదిలింది ఆప్యాయమైన భార్య మాటలతో. ఇంత దైన్యస్థితిలోకూడా నిర్మలమైన మనస్సూ-ఓరిమితో నిండిన ప్రవర్తన-మృదువైన పలకరింపూ-ఇలాంటి ఉత్తమమైన సాధ్వీమణితో తనకి వచ్చిన ఆలోచన చెప్ప డమా?... ఆమె ఎంత ఖిన్నురాలై పోతుంది .. ఊహుఁ!.... చెప్పను....చెప్పలేను .. ఇలా అనుకుంటూ గొంతు ఒకమారు సర్దుకుని కుడిచేత్తో గుండెలు రాసుకుంటూ, గొంతు పెకలి రాని మాటని పైకి అనలేక, అలాగని లోపల ఇముడ్చుకో లేక, ఇబ్బందిగా ఇటూ అటూ పచార్లు చేయసాగాడు నరసింహం....

భర్త పడుతూన్న బాధనీ, ఆవేదననీచూసి, అందుకు కారణం ఏవిటో అర్థంకాక, ఆ స్థితిలో అతణ్ణింక చూడలేక, గుండెబరువుతో పక్క గదిలోకి వెళ్ళి గోడకి జేర్లబడి ఉండి పోయింది సీతమ్మ.

భార్య అవతల గదిలోకి వెళ్ళడం చూసి "హమ్మయ్య" అని పెద్ద భారం తీరినట్లు పడక కుర్చీకి శరీరాన్ని జేరేశాడు

నరసింహం. "ఇప్పుడు అడగడం తప్పింది. కాస్సేపయ్యాకైనా అడుగుతాడుకదా?.... అప్పుడు మాత్రం ఏ మని అడుగుతాడు తను?.... సీతా! నీ మెడలో మంగళసూత్రాలు.... అంటూ అడగడమా? భగవంతుడా ఎంత నీచమైన ఆలోచనలు కలిగిస్తున్నావు నాకు?" ఇలా కొంత పైకి, కొంత మనస్సులోనూ, అనుకుంటూ, నెప్పిగా అయిన గొంతును ఓ మారు సర్దుకొని, వట్టి నోటినే గుటకవేశాడు నరసింహం.

భర్త నోట్లోంచి వచ్చిన అస్పష్టమైన మాటలు సీతమ్మకి అశనిపాతంలా వినిపించాయి. ఒక్క క్షణం జీవంలేని కట్టెలా అచేతనంగా నిలబడి పోయింది. తర్వాత పైట చెంగుతో కళ్ళు వత్తుకొని మెళ్ళోని మంగళసూత్రాల్ని కళ్ళకి అద్దుకొని వంటిట్లోకి నీరసంగా నడిచి వెళ్ళింది సీతమ్మ........

చేతిలో మంగళ సూత్రాలు పట్టుకుని ఎదురుగావచ్చి నిలబడ్డ భార్యని చూసి వణికిపోతూ, కంగారుగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు నరసింహం. ఆమె మెడలో పసుపుకొమ్ము చూసేసరికి, అతని గొంతులోంచి వెఱ్ఱి బాధ ఏదో, అర్థంలేని శబ్దంగా వెలువడింది. కాస్సేపటికి వణుకుతూ సన్నగొంతుని అదుపులో పెట్టుకుంటూ "సీతా...." ఆపైన ఏం అనలేక పోయాడు నరసింహం.

రాయిలా అయి పోతూన్న గుండె బరువుని అతి ప్రయత్నం మీద భరిస్తూ "తీసుకోండి బాధపడకండి."

అంది సీతమ్మ, తనలో మంటలా లేస్తూన్న బాధని భర్తకి కనిపించనీయకుండా....

"అదికాదు సీతా....ఏదో బలహీనతలో అనుకున్నాను కాని....నీ మంగళసూత్రాల్ని అమ్ముకుని ఆడబ్బుతో ఎలా హైదరాబాదు వెళ్ళి పెన్షన్ కాగితాలు...." డగ్గుత్తికతో మాట పూర్తి చెయ్యలేక, కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు నరసింహం.

"ఫరవాలేదు.... తీసుకోండి.... ఊ....మళ్ళీ అమ్మాయి వచ్చి చూస్తే బాగుండదు." అంటూ చేతిలో ఉన్న మంగళ సూత్రాలుభర్త చేతిలో ఉంచింది.

భార్య చేతిలో మంగళ సూత్రాల్ని తీసుకుని, "సంపదలు లేని ప్రేమలు భార్యాభర్తల్ని మరీ దగ్గరికి చేరుస్తాయి కాబోలు" అంటూ ఆమె వెన్నుమీద చెయ్యివేసి నిమిరాడు నరసింహం. భర్త ఊరడింపుతో వెల్లువలా ఉబికి వస్తూన్న ఆవేదనని అణుచుకుంటూ, తనని తాను సంబాళించుకుంటూ, అక్కడ నుంచి వెళ్ళిపోయింది సీతమ్మ.

"డబ్బురాగానే ముందుగా చేయించేస్తాను—ఏం?" అంటూ అడుగు కదిపిన భర్తని, వీధిమలుపు తిరిగే దాకా కళ్ళకి నిండుగా చూసుకుని నిట్టూర్చి లోపలికి వెళ్ళి పోయింది....

వెళ్ళిన నాలుగో రోజుకల్లా తిరిగివచ్చి, పట్టలేని ఉత్సాహంతో "సీతా మన కష్టాలన్నీ తీరిపోయాయి. నా

హైదరాబాదు ప్రయాణం బాగా ఉపయోగించింది. అక్కడ సీటులో ఉన్న కుర్రాడు ఎంత బుద్ధిమంతుడనుకున్నావు?.... పనిచేసి పెట్టాడు....వారం రోజుల్లో మనకి పెన్షన్ వచ్చేస్తుంది. 'నాయనా సాయంచేసి పెట్టావు....ఇంత కంటే ఇచ్చుకోలేను' అంటూ వందరూపాయలు ఇవ్వబోతే 'భలేవారే! మీదగ్గర లంచం పుచ్చుకుంటానా? మీరెంత నిజాయితీ అయిన మనుష్యులో, మానాన్నగారు చెబుతూ ఉండేవారు.' అంటూ ఆ డబ్బు నాజేబులోనే పెట్టి, రోడ్డు వరకూ వచ్చి సాగనంపాడు....అలాంటి కుర్రాడు మనకి అల్లుడైతేనా?.... అవును ఇంతకీ లలితేదీ?" అంటూ ఏక వరసన గబగబా మాట్లాడేయ సాగాడు నరసింహం.

పైటకొంగు నోట్లో కుక్కుకుని వచ్చే ఏడుపుని ఆపుకొంటూ "మీరు మరీ ఉద్రేక పడి చెప్పకండి....మీ ఆరోగ్యం ఏమంత మంచిది కాదు" అంది సీతమ్మ.

"అవున్లే....అదిసరే అమ్మాయి ఏది?"

సీతమ్మ బొటబొటా కన్నీరు కారుస్తూ నేలకేసి చూస్తూ ఉండిపోయింది.

"అమ్మాయి ఏదంటే మాట్లాడవేం?" ఆదుర్దాగా గట్టిగా అరిచాడు నరసింహం.

బావురు మని ఏడుస్తూ "రెండు రోజులయి అమ్మాయి కనిపించటం లేదండీ!" అంది సీతమ్మ.

గుండె ఆగినట్లయి, ఆ మట్టునే మంచంమీద కూలబడి, గ్రుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు నరసింహం.

"పిల్ల కనిపించటం లేదని రేడియోలో చెప్పించండి" కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది సీతమ్మ.

"ఏమని?.... ఎదిగినపిల్ల ... తండ్రి తన పెళ్ళి ఇంక చెయ్యలేడని నిశ్చయాని కొచ్చినపిల్ల .... దాదాపు 20 ఏళ్ళు ఎదిగిన పిల్ల ....తప్పిపోయిందనా?" అంటూ వెఱ్ఱిగా, పిచ్చిగా భయంకరంగా, దెయ్యం పట్టినవాడిలా, గుక్కపట్టి నవ్వుతూన్న భర్తని చూసి కంగారుపడి భయంతో, "ఏమండీ.... ఏమండీ .... ఏవిటానవ్వు .... గుండెలు పగిలిపోతున్నాయి. ఆపండి!" అంటూ ఏడుస్తూ గావు కేక ఒకటి పెట్టింది సీతమ్మ.

అంతే.... ఆ తర్వాత నరసింహం నవ్వు దానంతట అదే ఆగిపోయింది. తెరచిన నోరు తెరచినట్టూ, మూసిన కన్ను మూసినట్టూ ఆ మట్టునే ఉండిపోయాయి. ఇంత ప్రాకులాడిన పెన్షన్ గొడవా ఏం పట్టనట్లు, ఆ పెన్షన్‌లో నయా పైస కూడా, తాకకుండా ఈ జీవితంనుంచే రిటైరయి వెళ్ళిపోయాడు నరసింహం.

సీతమ్మ వెన్ను కలుక్కుమని విరిగి నట్లయింది.

మెడ చేత్తో తడుముకుని ఘొల్లుమంది. "నాకీ పసుపు కొమ్ముకూడా మిగల్చకుండా వెళ్ళిపోయారా?" అంటూ నేల మీద హృదయ విదారకంగా దొర్లి దొర్లి ఏడుస్తూ ఉండి పోయింది సీతమ్మ—

(స్నేహ)